క్లుప్తంగా

అంధులకు అల్పాహారం అందజేత



అంధులకు అల్పాహార ప్యాకెట్లను అందిస్తున్న ఇసీ దినేష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : కచేరి రోడ్డులోని శ్రీ వీర అంధుల ఆశ్రమంలో ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఇసీ గంగిరెడ్డి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇసీ గంగిరెడ్డి చిత్రపటానికి డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, వైసీపీ పట్టణ కన్వీనర్ గంగాధరరెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైఎస్ఆర్‌ట్రేడ్ ఆటో యూనియన్ జనరల్ సెక్రటరీ గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహార ప్యాకెట్లను వారు అంధులకు, అనాథలకు అందజేశారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, రసూల్, కౌన్సిలర్లు కోడి రమణ, కిశోర్, చంద్రమౌళి, మెకానిక్ శేఖర్, సుభాష్, గంగిరెడ్డి, దినేష్‌కుమార్‌రెడ్డి, బబ్లు, సందీప్‌రెడ్డి, శశాంక్‌రెడ్డి, శేఖర్, దుర్గ, బాబా, ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు రాకుండా చర్యలు

జమ్మలమడుగు : మంచినీరు కలుషితం కాకుండా చూడవలసిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని కన్నెలూరు, నేతాజీనగర్ ప్రాంతంలో కలుషిత నీరు తాగి ఆసుపత్రి పాలైన బాధితుల ఇళ్లకు ఆయన వెళ్లి పరామర్శించి ఆ ప్రాంతంలో ఉన్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మంచినీరు తమకు రావడంలేదని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ రాముడు సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ శానిటరీ సెక్రటరీలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. తడి, పొడి చెత్త సేకరణ, ప్రభుత్వ నిషేధి ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేధం, రోడ్లపై మురుగునీరు పారకుండా తదితర వాటిని చూసుకోవాలన్నారు. మున్సిపల్ మేనేజర్ మునికుమార్, డీఈ చిదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో పంటలు సాగుచేయాలి

చింతకొమ్మదిన్నె : రైతులు శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని అవగాహనతో పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కే ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లి, ఇపెంట గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం వరి పంటలను పరిశీలించారు. వరి పంటలో అధికంగా పాము తెగులు ఉన్నదని రైతులకు వివరించారు. ఉద్యాన శాఖ అధికారి జ్యోతీర్మయి, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

కుడా వైస్ చైర్మన్‌గా అదితి సింగ్

కడప కార్పొరేషన్ : కడప అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ(కుడా) వైస్ చైర్మన్‌గా ప్రస్తుత జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు వైస్ చైర్మన్‌గా ఉన్న వైఠ నందన్ సీడీఎంఏ డీడీగా బదిలీ అయిన నేపథ్యంలో ప్రభుత్వం జేసీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

జమ్మలమడుగు : ఉద్యోగులకు నూతన ప్రభుత్వం మధ్యంతర భృతిని ఈ దసరా పండుగకు ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వివేకానంద జూనియర్ కాలేజీలో ఎస్టీయూ నాయకుడు ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏపీజీఎల్ఐ, ప్రావిడెంట్ ఫండ్‌కు చెందిన ఫైనల్ పేమెంట్లు, లోన్ చెల్లింపులు పెండింగ్‌లో పెట్టారన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న వారిని సన్మానించారు.

బాధితులకు పరిహారం ఇవ్వాలి

జమ్మలమడుగు : పట్టణంలోని కన్నెలూరు, నేతాజీనగర్ ప్రాంతంలో కలుషితమైన నీరు తాగి వాంతులు, విరేచనాలతో బాధపడేవారికి ప్రభుత్వం రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని సీపీఎం కార్యదర్శి జి.ఏసుదాసు కోరారు. చాలా మందికి ప్రభుత్వాసుపత్రిలో సరైన వైద్యం అందదనే ఉద్దేశ్యంతో చాలా మంది ప్రభుత్వ ఆసుపత్రికి కాకుండా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించారన్నారు.

ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నేతాజీ నగర్ ప్రాంతంలో కలుషితమైన నీరు తాగి డయేరియా బారిన పడ్డ రోగుల ఇళ్లకు డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతి కళ, సిబ్బంది వెళ్లి వివరాలను సేకరించారు.

దేశ సేవ చేసి పదవీ విరమణ

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధికి చెందిన తిరుమలశెట్టి వేమనారాయణ ఆర్మీలో 24 ఏళ్లుగా దేశ సేవ చేసి పదవీ విరమణ చేశారు. గురువారం వేంపల్లెకి విచ్చేసిన వేమ నారాయణను బలిజ సంఘీయులు చిరు సత్కారం చేశారు.

గ్రామాల్లో స్వచ్ఛతకు పాతర

- గ్రామాల్లో కానరాని పారిశుద్ధ్యం
- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- నిరుపయోగంగా డంపింగ్ యార్డు షెడ్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డంగా మారిన షెడ్లు



చిలంకూరు గ్రామ పంచాయతీలోని డంపింగ్‌యార్డు సంపద కేంద్రం

ఎర్రగుంట్ల : గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. అంటు వ్యాధుల ముప్పు పొంచి ఉంది. గ్రామీణ జనం భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీతో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు నెలకొల్పింది. ప్రతి ఇంటిలో, వీధుల్లో సేకరించిన వ్యర్థాలను తడి, పొడిగా వేరుచేసి వాటి నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలనే ప్రణాళిక రూపొందించింది. పంచాయతీలకు ఆదాయం చేకూరేవిధంగా డంపింగ్ యార్డులో తయారు చేసే ఎరువును స్థానిక రైతులకు తక్కువ ధరలకు విక్రయించాలని సూచించింది. అయితే ఈ వర్మీకంపోస్టు తయారు చేసే విధానాన్ని చాలా పంచాయతీలలో చేపట్టలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ కేంద్రాలు మళ్లీ మూతపడ్డాయి, ఇప్పటి వరకు వాటి ఊసే ఎత్తకపోవడం శోచనీయం. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల కొరతతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలతో అధ్వానంగా మారింది. దీంతో దోమల వ్యాప్తి చెంది విషజ్వరాల బారిన పడుతున్నారు.

అందుబాటులో లేని సంపద కేంద్రాలు..

సంపద తయారి కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో సేకరించిన చెత్తను అక్కడికి తరలించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీల్లో సంపద కేంద్రాల నిర్వహనకు అనవరమైన నిధుల కొరత ఏర్పాడింది. మరోవైపు కార్మికులు అవసరమైన గౌరవ వేతనాలు సకాలంలో అందకపోవడం చేతులెత్తెవారు. ఫలితంగా సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

వినియోగంలోకి వచ్చేనా..?

కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపద కేంద్రాలను ఎప్పుడు వినియోగంలోకి తీసుకొస్తుందో అని ప్రజలు వేచిచూస్తున్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ చేసి పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కూటమి 2 ప్రభుత్వం చెత్త సేకరణ కోసం పనిచేసే కార్మికులకు వేతనాలు ఏలా చెల్లించాలని, నిధులు ఎలా సమకూర్చుకోవాలని సందిగ్ధంలో ఉంది.

మండలంలో 15 సంపద కేంద్రాలు..

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 15 సంపద కేంద్రాలు ఉన్నాయి. చాలా చోట్ల సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ సంపద కేంద్రాలన్నీ మందుబాబులకు అడ్డంగా మారినవి. రాత్రిళ్లు సమయంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చెత్త చదారం అంత గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడే పడేస్తున్నారు.



సున్నపురాళ్లపల్లి గ్రామ పంచాయతీలో అధ్వానంగా ఉన్న తడి పొడి తొట్లు



నిరుపయోగంగా మారిన చిలంకూరు పంచాయతీ తడిపొడి తొట్లు



చిలంకూరు సంపద కేంద్రంలో పడేసిన మద్యం సీసాలు, గ్లాసులు

త్వరలో వాడుకలోకి తెస్తాం..

మండలంలో 17 గ్రామ పంచాయతీలలో 15 సంపద కేంద్రాలు ఉన్నాయి. అన్నింటిని ఈనెల 14వ తేదీలోగా వాడుకలోకి వస్తాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ కోసం గ్రీన్ అంబాసిడర్లను అందుబాటులో ఉన్నారు. చెత్త సేకరణకు అవసరమైన వాహనాలను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. మేజర్ గ్రామ పంచాతీలలో ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఇంటికి డస్ట్ బిన్‌లు అందజేస్తాం. వీటి ద్వారా పంచాయతీలకు ఆదాయ వనరుల సమకూరేలా ప్రణాళిక సిద్ధం చేస్తాం.

రంహతులయ్య, ఈఓపీఆర్డీ, ఎర్రగుంట్ల

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల : మండలంలోని వెలిదండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి. కర్ణపాపాయపల్లె ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ బాల సంజీవులు తెలిపారు. ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

తిప్పలూరు సొసైటీ గొడౌన్ లీజుకు సిద్ధం

ఎర్రగుంట్ల : తిప్పలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన తిప్పలూరు సొసైటీకి చెందిన గొడౌన్ లీజ్‌కు ఇస్తామని తిప్పలూరు సొసైటీ సీఈఓ శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గొడౌన్ 500 ఎంటీల వరకు విస్తీర్ణం ఉందన్నారు. ఆసక్తి గల వారు ఏవరైన ఎర్రగుంట్ల పట్టణంలోని సొసైటీ కార్యాలయంనకు వచ్చి సంప్రదించాలన్నారు. వివరాలకు 9550050996, 9494141022 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఎర్రగుంట్ల : మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రంహమతులయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

జూదరులు అరెస్ట్

చక్రాయపేట : మడలంలోని చిలేకాంపల్లె మాలపల్లె సమీపంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.3,520 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రగారావు తెలిపారు.

విత్తన శుద్ధి తప్పని సరి



దేవరాజుపల్లెలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : పంటలు సాగు చేసే రైతులు విత్తనాలు పొలంలో చల్లే 48 గంటల ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పెద్దచెప్పలి, దేవరాజుపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఆమె రైతులకు వేరు శనగ పంట, అపరాల పంట సాగు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ గురించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలు సాగు చేసే రైతులు మేలైన, వ్యాధి నిరోధక శక్తి గల రకాల విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అయితే పంటలు సాగు చేసే 48 గంటల ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. అలా చేయడం వలన 15–25 రోజుల వరకు ఎటువంటి చీడపీడలు ఆశించకుండా ఉంటాయన్నారు. వేరు శనగ సాగుచేసే పొలాల్లో 4 టన్నుల పశువుల ఎరువు, 100 కిలోల ఎస్ఎస్‌పీ, 33కిలోల ఎంఓపీ, 200కిలోల జిప్సం, 20కిలోల జింక్ సల్ఫేట్ ఒక ఏకరాకు వాడాలన్నారు. పంటలకు ఆశించే తెగుళ్లను నివారించుటకు ట్రైకో డెర్మా విరిడిని పిచికారి చేయాలన్నారు.25శాతం సబ్సిడీతో అందించే శనగ విత్తనాల కోసం రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ఉండే వీఏఏలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఓబయ్య, ఎంపీటీసీ చెన్నకేశవరెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది మంజుల, రైతులు పాల్గొన్నారు.

25శాతం రాయితీతో శనగ విత్తనాలు



చిన్నచెప్పలిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : 25 శాతం రాయితీతో శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని, అవసరమైన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం మండంలోని చిన్నచెప్పలి రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న విత్తన రిజిస్ట్రేషన్‌ను ఆయన తనఖీ చేశారు. రిజిస్ట్రేషన్‌లో చేపట్టాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి తెలియజేశారు. అలాగే సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనగ క్వింటా పూర్తి ధర రూ.9400 ఉండగా 25 శాతం సబ్సిడీ రూ.2350 పోను మిగిలిన రూ.7050 చెల్లించి రైతు విత్తనాలు పొందాలన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డు, మొబైల్ ఫోను రైతు సేవా కేంద్రాలకు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఏకరాకు 20 కేజీల బస్తాలు రెండు చొప్పున, గరిష్టంగా 10 బస్తాలు ఇస్తారని తెలిపారు. కమలాపురం మండలానికి 4460 క్వింటాళ్లు, వల్లూరు 2393 క్వింటాళ్లు, ఎర్రగుంట్లకు 3959 క్వింటాళ్లు, వీరపునాయునిపల్లెకు 4070 క్వింటాళ్ల శగన విత్తనాలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, హార్టికల్చర్ అసిస్టెంట్ సుప్రియ రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ బుడ్డశనగ విత్తనాలు మంజూరు

లింగాల : రేపటి నుంచి మండలంలో సబ్సిడీ శనగ విత్తనాల కొరకు నమోదు ప్రారంభమవుతుందని మండల వ్యవసాయధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆయన తెలుపుతూ లింగాల మండలానికి మొత్తం 1838 క్వింటాళ్ల జేజీ–11 రకం శనగ విత్తనాలు మంజూరయ్యాయని.. వీటిని 25 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేస్తామన్నారు. మండలంలోని శనగ పంట సాగు చేసే రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, మొబైల్ నెంబర్‌ను సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మండలానికి శనగలు మంజూరు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలానికి సంబంధించి 887 క్వింటాళ్ల శనగలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి నాగలక్ష్మి తెలిపారు. శనగలు కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్వింటా శనగలు రూ.9.400లు కాగా.. సబ్సిడీ రూ.2350లు పోనూ.. రూ.7050లు రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెండు అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చెన్నూరు(వల్లూరు) : చెన్నూరు మండల పరిధిలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం రాత్రి పట్టుకున్నట్లు సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. తమ సిబ్బంది దాడులు నిర్వహించి షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రేపటి నుంచి శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్లు

వేముల : రబీ సాగుకు ప్రభుత్వం అందించే సబ్సిడీ శనగ విత్తనాల కోసం శనివారం నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏఓ చెన్నారెడ్డి రైతులకు సూచించారు. మండలానికి 2876 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. రైతులకు 20 శాతం సబ్సిడీతో క్వింటా రూ.7050లతో ఇస్తామన్నారు. 4.5 ఎకరాలు దాటిన ప్రతి రైతుకు 2 క్వింటాళ్ల శనగ విత్తనాలు సబ్సిడీపై అందిస్తామన్నారు. రబీలో శనగ పంట సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సబ్సిడీ శనగలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

పెద్దముడియం : మండలంలోని రైతులందరూ ప్రభుత్వం సబ్సిడీ మీద అందించే శనగలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణ తెలిపారు. పెద్దముడియం, పెద్ద పసుపుల గ్రామాలలో శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, మిగతా గ్రామాలలో సోమవారం నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. 20 కేజీల ప్యాకెట్ ధర రూ.1880 కాగా రూ.470 సబ్సిడీ పోనూ రూ.1410 రైతులు చెల్లించాలన్నారు. ఎకరాకు రెండు, ఐదు ఎకరాలకు పది ప్యాకెట్లు అందజేస్తామన్నారు.

నేడు మండల సమావేశం

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన శుక్రవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ లోకేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలన్నారు. సమావేశానికి అధికారులందరూ ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

సాంకేతిక యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి

వేముల : పంటల సాగులో సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గొల్లలగూడూరు గ్రామంలో సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చెన్నారెడ్డి మాట్లాడుతూ వేరుశనగ, పత్తి, శనగ పంటలలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులలో భాగంగా వేసవి లోతు దుక్కులు, విత్తన శుద్ధి ప్రాముఖ్యత, లింగాకర్షక బుట్టలు వాడటం, పసుపు, నీలం జిగురు అట్టల ప్రాముఖ్యత, అంతర పంటలు, కంచె పంటలు, ఎర పంటలను వివరించామన్నారు. గొల్లలగూడూరు 546 మంది రైతులు 1427 ఎకరాలలో పంట నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ రైతు సేవా కేంద్రాలలో ఇ-పంట రైతుల జాబితా సోషల్ ఆడిట్ కొరకు ఉంచడం జరుగుతుందన్నారు. ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. ఇ-పంట తుది ముసాయిదా జాబితా ఈనెల 16న ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

50 శాతం రాయితీతో విత్తనం అందించాలి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : బుడ్డశనగ విత్తనాన్ని 50 శాతం రాయితీతో అందించి రైతులకు ఆర్థిక వెసులుబాటు కలిగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కల్లూరు రఘునాథరెడ్డి కోరారు. గురువారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.7300ల దొరుకుతోందన్నారు. ప్రభుత్వ ధూ.9400 చూపుతూ 25 శాతం రాయితీ కలిప్తోందని రైతు వాటా రూ.7040తో విత్తనాన్ని అందించడం జరుగుతోందని ప్రకటించుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. బహిరంగ మార్కెట్ ధరకు, సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న ధరకు ఎటువంటి వ్యత్యాసం లేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విత్తనం ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు వీలుండదన్నారు. అంతే కాకుండా ముందుగానే నగదు చెల్లించడంతో ఎటువంటి విత్తనం అందించినా విత్తనాన్ని రైతులు తీసుకోవాల్సి వస్తుందన్నారు. గత ఏడాది పంటలు సరిగా పండకపోవడం, ఈ ఏడాది సకాలంలో వానలు కురవక పోవడంతో పంటలు సాగుచేయక రైతులు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వారికి నాణ్యమైన విత్తనాన్ని అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు వీరయ్యయాదవ్, బీసీ నాయకుడు ప్రతాప్‌యాదవ్, మాజీ సర్పంచ్ జంగంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జేసీ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న పంచాయతీ ఈఓ

వేంపల్లె : పట్టణంలో ప్రైవేట్ స్థలంలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను రైతు బజార్‌లోకి మార్చాలని జిల్లా సంయుక్త అధికారి ఆదితిసింగ్ ఇచ్చిన ఆదేశాలను పంచాయతీ ఈఓ బేఖాతారు చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ అరుగాలం కష్టపడే రైతు తాను పండించిన పంటను దళారులకు కాకుండా నేరుగా వినియోగదారులకు అమ్ముకోవాలనే ఉద్దేశంతో గత రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 కోట్ల వ్యయంతో రైతు బజార్‌ను నిర్మించిందని.. అయితే ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతు బజార్ ప్రారంభానికి నోచుకోలేదన్నా రు. ఆగస్టు 18వ తేదీన బీజేపీ రైతులతో కలసి రైతు బజార్ ప్రారంభించాలని కోరుతూ రైతు బజార్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. దీనిపై జేసీ అన్ని సౌకర్యాలు ఉన్న రైతు బజార్‌ను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. జేసీ ఇచ్చిన ఆదేశాలను మార్కెట్ కమిటీ ఎస్టేట్ ఆఫీసర్ రుచిత ఈఓకు ఇవ్వబోతే ఆయన నాకు ఇవ్వొద్దని.. నాకు డీపీఓ కార్యాలయం నుండి పంపుతారని.. అంతవరకు నాకు రైతు బజార్ విషయం చెప్పొద్దనట్లు తెలిపినట్లు తెలిసిందన్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని రైతు బజార్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు

- ఆలయాలకు కొత్త శోభ
- శ్రీదీక్షాబంధని అలంకారంలో అమ్మవారు



పులివెందులలో శ్రీబాలత్రిపురసుందరీదేవి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి



పులివెందుల : శ్రీదీక్షాబంధని అలంకారంలో అంకాలమ్మ అమ్మవారు



జమ్మలమడుగులో పార్వతీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరిదేవి



ఎర్రగుంట్ల : రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు

పులివెందుల టౌన్ : పట్టణంలో శరన్నవ రాత్రుల మహోత్సవాలతో ఆలయాలకు కొత్త శోభ సంతరించుకుంది. చలువ పందిళ్లతో, విద్యుత్ దీపకాంతులతో మిరిమిట్లు గొలుపుతూ ఎంతో అందంగా ఆలయాలు ముస్తాబు చేశారు. తొలిరోజు గురువారం పట్టణంలోని శ్రీఅంకాలమ్మ, అమ్మవారిశాల ఆలయాల్లో దసరా ఉత్సవాలతో కొత్త శోభను సంతరించుకున్నాయి. స్థానిక అమ్మవారిశాలలో శ్రీబాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారిని అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రవికుమార్, ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్, ఈఓ రమణల ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం అమ్మవారిని శ్రీదీక్షాబంధని అలంకారంలో ముస్తాబుచేసి భక్తులకు దర్శనం కల్పించారు. బ్రాహ్మణపల్లె గ్రామంలోని శ్రీమాలేగంగమ్మ ఆలయంలో గంగమ్మతల్లి అమ్మవారు శ్రీబాల త్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : పాతూరు చౌడేశ్వరిదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. చౌడేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

వేములలో..

వేముల : గొల్లలగూడూరు గ్రామంలోని నల్లనమ్మ ఆలయంలో దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీనల్లనమ్మ అమ్మవారు శ్రీదీక్షాబంధనీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సాయంత్రం ఆలయంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం అమ్మవారిఇ అభిషేకాలు నిర్వహించారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో శ్రీ మత్కన్యకాపరమేశ్వరీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో యువజన సంఘం సహకారంతో గురువారం నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అమ్మవారు మొదటి రోజు దీక్షాబంధన అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. తల్లం రజనీకాంత్ కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టుచీరె సమర్పించారు. రాత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని గంగమ్మతల్లి ఆలయంలో అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వహణ అధికారి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని గడ్డంవారిపల్లెలోని రాజరాజేశ్వరీదేవి, తలపనూరు గంగమ్మతల్లి, కీర్తిపల్లె నల్లనమ్మతల్లి, అనిమెల బోగాదమ్మతల్లి, ఉరుటూరు చౌడమ్మతల్లి, అనిమెల సంగమేశ్వర స్వామి దేవస్థానాలలో గురువారం దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తలపనూరు గంగమ్మ తల్లిలక్ష్మీదేవి అలంకరణలో, సంగమేశ్వరాలయంలో శాంభవీదేవిగా, కీర్తిపల్లె నల్లనమ్మతల్లి, గడ్డంవారిపల్లెలోని రాజరజేశ్వరీదేవి బాలత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : పడమటి వీధిలో వెలిసిన శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో తొలిరోజు అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులను కటాక్షించారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : స్థానిక కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అందించారు. నాగులకట్టలోని చౌడేశ్వరిదేవి, కన్నెలూరులోని చౌడేశ్వరిదేవి ఆలయాలను అలంకరించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : స్థానిక శివాలయం నుంచి 54 కలశాల జలాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం రాత్రి శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని కన్నకాపరమేశ్వరీదేవి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో, శ్రీ ఏరువాక గంగమ్మ ఆలయంలో బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో, చౌడేశ్వరీ ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో, మహేశ్వనగర్ కాలనీలోని శివాలయంలో, ఆర్టీపీపీలోని చౌడేశ్వరీ ఆలయంలో శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమించారు.

కొండాపురంలో..

కొండాపురం : దత్తాపురం పునరావాస కేంద్రంలో గురువారం శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయంలో బాలత్రిపురసుందరిదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి దర్శనమిచ్చింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.